## పంచాయతీ మోటర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి



ఇబ్రహీంపట్నం, మే 9 : మండల పరిధిలోని ముకునూరు గ్రామంలో వేసవి దృష్ట్యా పంచాయతీ మోటరుకు విద్యుత్ సౌకర్యం లేనందున గృహ అవసరాలు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ట్రాన్స్‌కో ఏడీఈ సీతారాములుకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ మోటర్ ఉన్న ప్రాంతం వరకు విద్యుత్ కనెక్షన్ దూరంగా ఉండటంతో ఇబ్బంది ఉందని, నాలుగు స్తంభాలతో పాటు వైర్ కనెక్షన్ ఇచ్చి సమస్య పరిష్కరించాలని కోరారు.

## పట్టుబడిన వాహనాలకు వేలం

ఆమనగల్లు, మే 9: ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం 10.30 నిమిషాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.10వేలు దరావత్ చెల్లించాలని ఆయన సూచించారు.

# రైతులు మెళకువలు పాటించాలి

- గ్రామాల్లో కొనసాగుతున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం
- పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు
- తెలంగాణ రైతు కమిషనర్ మెంబర్ రాములూనాయక్



ఇబ్రహీంపట్నం : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ రైతు కమిషన్‌మెంబర్ రాములు నాయక్

ఇబ్రహీంపట్నం, మే 9 : వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని తెలంగాణ రైతు కమిషన్ మెంబర్, మాజీ ఎమ్మెల్సీ రాములూనాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా



నందిగామ : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములూనాయక్ మాట్లాడుతూ.. రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముఖ్యంగా రైతులు పంటల మార్పిడి విధానం పాటించడంతో పాటు తక్కువ యూరియా వాడటం, సాగుఖర్చును తగ్గించటంతో పాటు అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని తెలిపారు. సాగునీటిని ఆదాచేసి భావితరాలకు అందించాలన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. పంటలకు ఎలాంటి చీడపీడలు సోకినా సొంతంగా నిర్ణయం తీసుకోకుండా అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు సుస్థిర వ్యవసాయంపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, సునిత, వ్యవసాయాధికారులు విద్యాదరి, శ్రవణ్‌కుమార్, సృజన తదితరులు పాల్గొన్నారు.

**నందిగామలో**

నందిగామ : ప్రభుత్వం చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం శుక్రవారం నందిగామ మండలం బండోనిగూడా గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు భారతి, రాకేశ్‌లు హాజరై రైతులకు తక్కువ పెట్టుబడితో పంటల సాగు ఎక్కువ దిగుబడి సాధించడం గురించి పంటసాగులో వచ్చే సమస్యల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు రవి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్, మే 9: ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి కంపెనీల వల్ల దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందనవెల్లి పారిశ్రామిక ప్రాంతంలో వలస కార్మికుల శ్రమను పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 20వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో చందనవెల్లి క్లస్టర్ సీఐటీయూ నాయకులు దాసుగుప్తా, కుమార్‌యాదవ్, ప్రకాశ్, విక్రమ్, ఖాన్ తదితరులున్నారు.

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయాంజాల్, మే 9 : సాధారణ మరమ్మతుల కారణంగా తుర్కయాంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మి మెగా టౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్‌నగర్, లక్ష్మిగార్డెన్, కుర్మగూడ, వైఎస్సార్ నగర్‌కాలనీ, యంజాల్ పాత విలేజ్‌లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తుర్కయాంజాల్ సబ్‌స్టేషన్ ఏఈ తెలిపారు. అదే విధంగా సీనర్జీ హోమ్స్, ద్వారక నగర్, శోభానగర్, సిలికాన్‌నగర్, ఏవీనగర్, వింటేజ్ హోమ్స్, యాదాద్రి హోమ్స్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# సర్కార్ బడుల్లోనే నాణ్యమైన బోధన

తుర్కయాంజాల్, మే 9 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన కొనసాగుతున్నదని కొహెడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతిబాయి అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కొహెడలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యాభోధన జరుగుతుందని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని వారు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు సన్మానం**

ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను శుక్రవారం కొహెడ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. పాఠశాల టాపర్ సౌమ్య, రిషిక, హసిని, అక్షిత, నివాస్, మృదుభాసిని తేజశ్రీ, భార్గవిలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి జగదీశ్వర, అబ్దుల్లాపూర్ ప్రధానోపాధ్యాయులు రమేశ్, ఉపాధ్యాయులు కె.భాస్కర్, సురేఖ, గీతారాణి, ప్రవీణ్‌కుమార్‌తో పాటు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

**ఆదిబట్లలో..**

ఆదిబట్ల : ఆదిబట్ల గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే బోధనపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్కాల పరమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, భాషయ్య, అంగన్‌వాడీ టీచర్లు బేబీ పాల్గొన్నారు.

**కొందుర్గు :** భైరంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మీనా అన్నారు. గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నారులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంల వంటి సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తుర్కయాంజాల్ : కొహెడలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

**తంగడిపల్లిలో..**

చేవెళ్లరూరల్ : ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభం కానున్న సందర్భంగా చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బడీలు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో తంగడిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మొయినాబాద్ :** మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి తమ పిల్లల భవిషత్‌కు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యాధికారి మల్లయ్య, నాగిరెడ్డిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి పగిడిపాల పాండు అన్నారు. శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీలో ఎస్సీకాలనీ, శ్రీకాంత్‌కాలనీ, ఉదయ్‌నగర్ కాలనీల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ అన్ని వసతులు కలిగిన సర్కార్ బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, ఉపాధ్యాయులు కృష్ణయ్య, సీఆర్‌పీ కిషన్ తదితరులు ఉన్నారు.



అబ్దుల్లాపూర్‌లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



చేవెళ్ల రూరల్ : తంగడిపల్లిలో 'బడిబాట' నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కొందుర్గు: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయురాలు మీనా



మొయినాబాద్‌లోని నాగిరెడ్డిగూడలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యా శాఖ అధికారులు

## బాధితుడికి న్యాయం చేయాలి

హిమాయత్‌నగర్, మే 9: బాధ్యతాయుతమైన పోలీస్ వృత్తిలో ఉండి అమాయక ప్రజలను మోసం చేస్తున్న ప్రస్తుత చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్‌పై చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు బి. కృష్ణతో కలిసి పబ్బతి శ్రీకృష్ణ మాట్లాడారు. నాగర్ కర్నూల్ జిల్లా, ఊరకొండ మండలం, రాచాలపల్లిలోని సర్వే నం.113ఉ, 113అ, 113ఈ,130 లో ఏడు ఎకరాల 33 గుంటల భూమి ఉందని తెలిపారు. కుటుంబ అవసరాల నిమిత్తం తమ భూమిని విక్రయించేందుకు తన మిత్రుడు పవన్ సంప్రదించగా అతడి సోదరుడు చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్‌ను తనకు పరిచయం చేశాడని, తాను ఆ భూమిని అమ్మిస్తానని ఒప్పుకున్నాడు. భూమిని ఇతరులకు అమ్మి మూడేండ్లు గడిచినా డబ్బులు అతడి వద్ద పెట్టుకొని తనకు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కృష్ణ మొరపెట్టుకున్నాడు.



సమావేశంలో మట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

మొయినాబాద్, మే 9 : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని అమ్డాపూర్ సబ్ సెంటర్ వైద్యురాలు దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానకాలం, సలికాలంలో పశువులు రోగాల బారిన పడకుండా తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



అమ్డాపూర్‌లో పశువుకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న దేవిరెడ్డి



## వాలీబాల్ క్రీడలో ఉచిత శిక్షణ

కేశంపేట, మే 9: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడలో ఉచిత శిక్షణ కొనసాగుతుంది. ఈ సందర్భంగా పీఈటీ విద్యార్థులకు వాలీబాల్‌లో మెళకువలను నేర్పి మాట్లాడారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, 7 నుంచి 25ఏళ్ల వయస్సుగల ప్రతి ఒక్కరికీ నెల రోజులపాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. వేసవిలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఉచిత శిక్షణకు పంపించాలని, పాపిరెడ్డిగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో జరిగే శిక్షణను ఆసక్తిగల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభం




పెద్దఅంబర్‌పేట, మే 9: సమగ్ర శిక్ష అభియాన్ నుంచి మంజూరైన రూ.54 లక్షల నిధులతో పెద్దఅంబర్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు మాజీ కౌన్సిలర్ పసుల రాజేందర్ ముదిరాజ్ తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూడు తరగతి గదుల నిర్మాణంతోపాటు ఒక సైన్స్ ల్యాబ్ పనులను శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తిచేయాలని, నాణ్యతగా చేపట్టాలని సూచనలు చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికురాలికి నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 9 : బాటసింగారం జిల్లాపరిష్యత్ ఉన్నత పాఠశాలలో 15 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా సేవలందించిన పి. పారిజాత అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్యాల యాదగిరి ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆమె భౌతికకాయానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. పారిజాత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి వారికి అండగా ఉంటామని తెలిపారు.

# పైసల్ ఇస్తేనే.. ఫైల్స్ కదులుతాయి

- డోర్ నంబర్ల కోసం వందల సంఖ్యలో దరఖాస్తులు
- నెలలు దాటినా పట్టించుకోని అధికారులు
- 'బడంగ్‌పేట్'లో అధికారుల తీరు మారేది ఎప్పుడో?




బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బడంగ్ పేట్, మే 9: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పైసల్ ఇస్తేనే ఫైల్స్ కదులుతాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి . రెవెన్యూ సెక్షన్లో ఇంటి నంబర్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వాళ్లు ఐదు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా డోర్ నంబర్లు జారీ చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. 600ల పై చిలుకు ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఎవరి ఫైలు ఎక్కడుందో తెలియడం లేదంటున్నారు. అధికారుల చేతులు తడిపితే క్షణాలలో డోర్ నంబర్ జారీ అవుతుందన్న విమర్శలు ఉన్నాయి.

బిల్ కలెక్టర్లను దరఖాస్తుదారులు అడుగగా ఆఫీసులో ఇచ్చేశామని చెప్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ఆర్ఐ దగ్గర ఫైళ్లు పెండింగ్‌లో లేవంటున్నారు. ఆర్వో దగ్గర పెండింగ్ ఫైల్స్ లేవంటున్నారు. కమిషనర్ లాగిన్‌లో ఏమీ లేవు అంటున్నారు. వందల ఫైల్స్ ఎక్కడ మాయమైనట్లు అన్న సందేహాలు వస్తున్నాయి. బిల్ కలెక్టర్లు మాత్రం ఐదారు వందల ఫైళ్లు పెండింగ్లో ఉన్నట్లు చెప్పకనే చెప్తున్నారు. సకాలంలో ఫైల్స్ చేయడం లేదని బాధితులు మాత్రం మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చి లొల్లి చేస్తున్నారు. తమ దగ్గర లేదని ఎవరికి వాళ్లు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఎలాంటి అనుమతులు లేని ఇళ్లకు డోర్ నెంబర్లు జారీ చేస్తున్న అధికారులు మిగతా వాటికి డోర్ నెంబర్లు ఎందుకు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఫైల్స్ పెండింగ్ విషయంలోనే అధికారుల మధ్యన విభేదాలు వచ్చినట్లు సమాచారం. చాలాసార్లు పెండింగ్ ఫైల్స్ విషయంలో ఆర్వో కు కమిషనర్ మధ్యన తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. సదురు ఆర్వో పైన బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లు సైతం ఫిర్యాదు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అధికారుల మధ్యన ఉన్న విభేదాల కారణంగానే డోర్ నెంబర్ జారీ విషయంలో జాప్యం జరుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కొంతకాలంగా జరుగుతున్న తతంగంపై పై అధికారులు దృష్టి సారించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నా యి.

**ఇద్దరు ఆర్వోలు ఉన్నా కదలని ఫైళ్లు**

రెవెన్యూ సెక్షన్లో డోర్ నెంబర్ల విషయంలో జాప్యం జరుగుతుందన్న ఉద్దేశంతో ఒక ఆర్వోకు బదులు మరో ఆర్వోను నియమించారు. ప్రస్తుతం ఇద్దరు ఆర్వోల మధ్యన సమన్వయం లేనట్లు తెలుస్తోంది. రెవెన్యూ సెక్షన్‌లో పెండింగ్ ఫైళ్లు మాత్రం పేరుకుపోయి ఉన్నాయి. అర్జెంటుగా డోర్ నెంబర్ కావాలనుకునేవాళ్లు నెలల తరబడి ఆగవలసిందే. అధికారుల తీరు పట్ల దరఖాస్తుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో మాత్రం మార్పు రాలేదు.

## వధువుకు పెండ్లి కానుక బహూకరణ

కడ్తాల్, మే 9: మండలంలోని పేద కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. కడ్తాల్ గ్రామానికి చెందిన డేరంగుల పద్మ-మల్లేశ్ కూతురు పావని వివాహం శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. దశరథ్ నాయక్, ఆనంద్ సమాకూర్చిన రూ.10 వేలను వడ్డెర సంఘం నాయకులు వధువుకు అందజేశారు. వారి వెంట వడ్డెర సంఘం నాయకులు వెంకటేశ్, జంగయ్య, యాదయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, సైదులు, నాగార్జున్ తదితరులు ఉన్నారు.

## పుస్తె మెట్టల అందజేత

కేశంపేట, మే 9: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన మల్లయ్య, సుగుణ దంపతుల కుమార్తె కీర్తన వివాహం సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనారాయణ కవిత దంపతులు శుక్రవారం పుస్తె మెట్టలను అందజేశారు. వారి వెంట చెన్నయ్య, రాఘవేందర్, మారతమ్మ, రామకృష్ణ, రాంకొండల్, శ్రీశైలం, రవి, రామస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి

కడ్తాల్, మే 9: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఎంఈవో చాంప్లానాయక్‌ను కలిసి టీఎస్ఎస్‌వో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యలు పుస్తకాలు, యూనిఫాం పేరిట దందాను కొనసాగిస్తున్నాయని తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నితీశ్‌వర్మ, శ్రీకాంత్, శ్రీశైలం, సందీప్, లోకేశ్ తదితరులు ఉన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ఎస్‌వో నాయకులు

## హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేండ్ల జైలు

చేవెళ్ల రూరల్, మే 9 : హత్యాయత్నం కేసులో నిందితుడికి చేవెళ్ల కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం గాజులగూడకు చెందిన గుండె దుర్గాప్రసాద్, రాజేందర్‌రెడ్డి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం నెలకొన్నది. 2024 ఫిబ్రవరి 10న రాజేందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్‌ను దవాఖానకు వెళ్దామని చెప్పి, ద్విచక్ర వాహనంపై గాజులగూడ శివారులోకి తీసుకెళ్లాడు. అక్కడ వాహనాన్ని ఆపి, తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించి, దుర్గాప్రసాద్ తలపై గ్రానైట్ రాయితో బాదాడు. తల పగిలి రక్తస్రావం కావడంతో దుర్గాప్రసాద్ మరణించినట్లు భావించి నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని దుర్గాప్రసాద్‌ను స్థానికంగా ఉన్న దవాఖానకు తరలించడంతో ప్రాణపాయం లేకుండా బయటపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాలు, సాక్షులను సేకరించి కోర్టులో సమర్పించడంతో విచారించిన చేవెళ్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దశరథరామయ్య శుక్రవారం నిందితుడు రాజేందర్‌రెడ్డికి ఐదేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.250 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసు విచారణలో కీలకపాత్ర వహించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాదయ్య, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, కోర్టు అధికారులను రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అభినందించారు.

## భవిష్యత్ కాలానికి శిక్షణ అవసరం

వ్యవసాయ యూనివర్సిటీ : కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయ విద్యార్థుల్లో ఆవిష్కరణ స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించే దిశగా ఆవిష్కరణలు ఉంటాయన్నారు. ఐసీఏఆర్ నార్మ్ జాయింట్ డైరెక్టర్ , ఐడియా వైస్ ప్రెసిడెంట్, డాక్టర్ గోపాల్‌లాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సంప్రదాయ విద్యా మార్గానికి భిన్నంగా ఆలోచించాలన్నారు. పట్టణ వ్యవసాయం, స్మార్ట్ వ్యవసాయం , వెల్నెస్-ఆధారిత ఉత్పత్తులు వంటి కొత్త సరిహద్దులను అన్వేషించే ప్రాముఖ్యతను వివరించారు.

అనంతరం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యానవన రంగంలో విద్యార్థులకు స్టార్టప్ రంగంలో పెరుగుతున్న అనేక అవకాశాలను ఉదాహరణలతో వివరించారు. మూలిక టీలు, నూనెలు , పర్యావరణ అనుకూల ఎరువులు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను వ్యాపార మార్గాలుగా పరిగణించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. సైదయ్య ,ఏఐడియా సీఈవో డాక్టర్ ఎస్. సెంథిల్ తదితరులు మాట్లాడుతూ విదార్థులకు పలు సూచనలు చేశారు.